క్లుప్తంగా

గుడి, బొడ్రాయి ప్రతిష్ఠకు రూ.2 లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న వీరునాయక్

రఘునాథపాలెం: మండలంలోని కేవీ బంజర గ్రామంలో బొడ్రాయి, ముత్యాలమ్మ గుడి నిర్మాణానికి గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ అజ్మీరా వీరూనాయక్ రూ.2 లక్షలు విరాళంగా సోమవారం గ్రామంలోని దేవాలయంలో కమిటీకి అందించారు. మాజీ సర్పంచ్ గుండా మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లీపిల్లల సంరక్షణే లక్ష్యం

ఖమ్మంరూరల్: తల్లీపిల్లల సంరక్షణే ఐసీడీఎస్ ప్రాజెక్ట్ లక్ష్యమని సీడీపీఓ కమలప్రియ అన్నారు. సోమవారం మండలంలోని నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రంలో పాఠశాల వార్షికోత్సవంలో ఆమె మాట్లాడుతూ... ఆంగ్ల మీడియంలో ప్రీ స్కూల్ నడుస్తోందని పిల్లలందరినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సువర్ణ, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, సరిత, సరోజిని, ఉపేంద్రమ్మ, పద్మ, చంద్రకళ, రామనాథం తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఖమ్మంరూరల్: మండలంలోని కరుణగిరిలో అల్లె సాయికిరణ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను కాంగ్రెస్ ఖమ్మం నగర అధ్యక్షుడు, పీసీసీ సభ్యులు మహ్మద్ జావీద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమని, గెలుపు స్ఫూర్తిగా తీసుకుని క్రీడలలో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో సింగం అంజయ్య, సత్యనారాయణ, లక్ష్మణ్, జహీర్, ఆసీఫ్, ఉపేందర్ పాల్గొన్నారు.

24న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలు

కామేపల్లి: మండలంలోని బర్లగూడెం గ్రామంలో ఆర్‌ఆర్‌ఆర్ మెమోరియాల్ ప్రజెంట్స్ బీపీఎల్-4 ప్రీమియర్ లిగ్ మిట్టగ్రౌండ్‌లో ఈనెల 24న రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఎక్స్‌లెంట్ యూత్ నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రథమ బహుమతి రూ.35 వేలు, ద్వితీయ బహుమతి రూ.15 వేలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన క్రీడాకారులు 9492341439, 8074829934, 9963117996 నంబర్లకు సంప్రదించి వివరాలను నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు.

బెల్ట్‌షాపులను రద్దు చేయాలి

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లా వ్యాప్తంగా విచ్చలవిడిగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ శిరోమణి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్‌కు బెల్ట్ షాపులను రద్దు చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు. గ్రామాల్లో బెల్ట్ షాపుల నిర్వహణతో అర్ధరాత్రి కూడా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయని, సమయపాలన లేకుండా విక్రయాలు చేస్తున్నారన్నారు. బెల్ట్ షాపుల వలన అనర్థాలు జరుగుతున్నాయని, వీటిని వెంటనే మూయించాలని కోరారు. పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల మంగతాయి, జిల్లా ఉపాధ్యక్షురాలు ఝాన్సీ, జిల్లా సహాయ కార్యదర్శి శోభ, నాయకులు జక్కుల వనిత, బేగం పాల్గొన్నారు.

వైఎస్ జగన్‌పై దాడి హేయం

ఖమ్మంమయూరిసెంటర్: ఓడిపోతామనే భయంతోనే ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై చేసిన దాడి హేయమైన చర్య అని వైఎస్సార్ అభిమాని జిల్లపల్లి సైదులు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి తట్టుకోలేక ఆయనపై హత్యాయత్నం చేయించారన్నారు. ఈ దాడిని ప్రజాస్వామిక వాదులు ఖండించాలన్నారు.

సీపీని కలిసిన మసీద్ కమిటీ సభ్యులు

ఖమ్మంక్రైం: ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ నిర్వహించుకునేందుకు బందోబస్తుకు సహకరించినసీపీ సునిల్ దత్ సోమవారం మసీద్ కమిటీ సభ్యులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను ఘనంగా సన్మానించారు. షేక్‌అబ్దుల్ రషీద్ అలీ ఖాన్, అఫ్సర్ అజీజ్, అబ్దుల్ రెహమాన్ పాల్గొన్నారు

బాలిక కిడ్నాప్‌పై కేసు

ఖమ్మంఅర్బన్: ఖమ్మం రామన్నపేటకు చెందిన బాలిక(15) కిడ్నాప్ అయినట్లు ఆమె తండ్రి ఫిర్యాదుతో ఖమ్మం అర్బన్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఖమ్మం రూరల్ మండలం ముత్తగూడెంకు చెందిన యువకుడు తన కుమార్తెను కిడ్నాప్ చేసినట్లుగా అనుమానముందని ఆయన ఫిర్యాదులో పేర్కొన్నారు.

నగరంలో సినిమాలు

తిరుమల	ది ఫ్యామిలీ స్టార్
వినోద	టిల్లు 2
సాయిరాం	బడేమియా చోటే మియా
ఆదిత్య	గీతాంజలి మళ్లీ వచ్చింది
శ్రీనివాస	మంజుమ్మల్ బాయ్స్
సుందర్	లవ్‌గురూ

- ఖమ్మం గాంధీచౌక్

పలచబడుతున్న పచ్చదనం

ప్రకృతివనాలపై పట్టింపులేని వైనం

- రక్షణ, నీరు లేక సగానికి పైగా మొక్కలు హరీ
- ఉపాధి హామీ పర్యవేక్షణ ముగియడంతో జీపీలకు బాధ్యత
- ఇతర పనుల భారంతో పట్టించుకోని సిబ్బంది



ఆనవాళ్లు కోల్పోతున్న వేపకుంట్ల పల్లె ప్రకృతివనం

రఘునాథపాలెం: తెలంగాణ ఏర్పాటయిన తర్వాత టీఆర్‌ఎస్ ప్రభుత్వం హరితహారం పేరుతో పెద్ద ఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టింది. మూడేళ్ల క్రితం ప్రతీ పంచాయతీలో పల్లె పకృతివనం, మండలంలో పెద్ద గ్రామాల్లో మండల బృహత్తర పకృతివనం పేరుతో ప్రభుత్వ స్థలాల్లో చుట్టూ రక్షణ చర్యలు చేపట్టి, పంచాయతీ, ఉపాధి హామీ పథకం నిధుల భాగస్వామ్యంతో లక్షలాది మొక్కలు నాటారు. నాటిన మొక్కలు లెక్కలకే తప్ప వాటి సంరక్షణలో మాత్రం నాటిన సమయంలో ఉన్న ఉత్సాహం, పర్యవేక్షణ, బాధ్యత లేకపోవడంతో ప్రకృతివనాల్లో నాటిన మొక్కలు వడిలిపోవడం, ఎండిపోవడం, గడ్డి పట్టి కాలగర్భంలో కలిసిపోవడంతో హరిత వనాలన్నీ మొక్కలు లేక పలచబడ్డాయి.

పట్టించుకోని 'సుడా'.. పంచాయతీ

రఘునాథపాలెం మండలంలోని 40 పంచాయతీల్లో లక్షన్నరపైగా ప్రకృతివనాల్లోనే మొక్కలు నాటారు. అవి కాక ప్రతీ ఏటా ప్రతి పంచాయతీల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో, ప్రధాన రహదార్లకు ఇరువైపుల, చెరువుకట్టలు, తదితర ప్రాంతాల్లో సైతం మొక్కలు నాటించారు. అక్కడక్కడ కొన్ని గ్రామాల్లో మాత్రం మచ్చుకు కనపడుతున్నాయి. చాలా గ్రామాల్లో మొక్కలు రక్షణ లేక లెక్క తప్పి కనపడుతున్నాయి. మండల బృహత్తర పకృతి వనం పేరుతో రఘునాథపాలెంలో పదెకరాల్లో 'సుడా' భాగస్వామంతో చెరువును అభివృద్ధి చేసి దానికి ఆనుకుని వాకింగ్ ట్యాంక్, మినీ జిమ్ అందుబాటులోకి తీసుకొచ్చారు. కానీ ఆ తర్వాత ఇటు పంచాయతీ, ఆటు సుడా అధికారులు, పాలకులు పట్టించుకోకపోవడంతో అధ్వానంగా మారింది.

కొన్ని మొక్కలు ఓకే..

సుడా పార్క్‌లో 20 వేల పైగా మొక్కలు నాటారు. అక్కడ మొక్కలు కొంతమేరా కనపడుతున్నా పర్యవేక్షణ లోపంతో నానాటికీ మొక్కల సంఖ్య తగ్గిపోతోంది. రఘునాథపాలెం పంచాయతీలో గ్రామ ముఖద్వారంలో చెరువుకట్టపై, బీసీ కాలనీలో గ్రీన్ బెల్ట్ స్థలంలో సైతం అభివృద్ధి చేసి రూ.లక్షలు వెచ్చించి మొక్కలు నాటించారు. ఇక వీవీపాలెం కాల్వ కట్టపై కూడా ప్రకృతి వనం ఏర్పాటు చేసినా అరకొరగానే మొక్కలు దర్శనమిస్తున్నాయి. వేపకుంట్ల చెరువు కట్టను ఆనుకుని వాటర్ ట్యాంక్ వద్ద ఏర్పాటు చేసిన పకృతి వనం చూస్తే మండలంలో పల్లెపకృతివనాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. చింతగుర్తి, బూడిదంపాడు, ఇలా కొన్ని గ్రామ పంచాయతీల్లో మాత్రం కొంతమేర ప్రకృతివనాలు పెరిగి చూపరులను ఆకట్టుకుంటున్నాయి.

వేసవిలో నీటి సమస్య..

చాలా గ్రామాల్లో వేసవిలో తాగునీటి సమస్య ఎదురవుతోంది. ఈ సమయాన ప్రకృతివనాల్లో మొక్కలను రక్షించడం సాధ్యం కాదని గ్రామ స్థాయిలో అధికారులు చెప్పకనే చెబుతున్నారు. చాలా పంచాయతీల్లో బోర్ల నీటి ఆధారంగానే మొక్కలు నాటించారు. ఉపాధి హామీ పథకం ద్వారా నర్సరీల్లో మొక్కలు పెంచి కూలీలతోనే నాటించి రెండేళ్ల పాటు సంరక్షణ బాధ్యతలు చూశారు. ఆ తర్వాత పంచాయతీలే చూసుకోవాల్సి ఉంది. దీంతో ఇప్పటికే పంచాయతీల్లో



అరకొరగా ఉన్న సిబ్బంది, కొద్దిపాటి నిధులతో భారంగా మారడంతో చూసిచూడనట్లుగా వ్యవహరించడంతో చాలా పంచాయతీల్లో మొక్కలు హరీమంటున్నాయి. ప్రధానంగా మండల బృహత్ వనాల పరిస్థితి అధ్వానంగా మారిందని ప్రజలు చెబుతున్నారు.

ప్రత్యేక దృష్టి సారించాం..



మండలంలోని అన్ని పంచాయతీల్లో పల్లెప్రకృతి వనాల్లో నాటిన మొక్కలను సంరక్షిస్తాం. ఇందుకోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని చోట్ల మొక్కలు చనిపోవడంతో ఖాళీగా కనిపిస్తోంది. వర్షాలు పడ్డాక ఆ స్థానంలో మళ్లీ మొక్కలు నాటించాలని, అప్పటి వరకు మిగతా మొక్కలను కాపాడాలని కార్యదర్శులకు సూచించాం.

– శ్రీనివాసరెడ్డి, మండల పంచాయతీ అధికారి

జ్వర బాధితుల రక్త నమూనాలు సేకరణ

సాక్షి ఎఫెక్ట్..

తిరుమలాయపాలెం: మండలంలోని హైదర్‌సాయిపేటలో నెల రోజుల నుండి అంతుచిక్కని జ్వరాలతో ప్రజలు పడుతున్న అవస్థలపై సోమవారం సాక్షిలో ప్రచురితమైన 'అంతుచిక్కని జ్వరాలతో నరకయాతన' అనే కథనంపై జిల్లా వైద్యశాల అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో జిల్లా వైద్యశాఖ కార్యాలయం నుంచి హెచ్‌ఈఓ వెంకటరెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ యాకూబ్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ రామారావు గ్రామంలో జ్వర బాధితుల రక్త నమూనాలను సేకరించి జిల్లా ఆస్పత్రికి పంపించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ కార్యాలయ అధికారి వెంకటరెడ్డి ఇంటింటికి తిరిగి దోమల వ్యాప్తిని పరిశీలించి దోమల నివారణకు మందులను వేయించారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి



రక్త నమూనాలు సేకరిస్తున్న వైద్య సిబ్బంది

మందులు అందజేశారు. బాగా ఇబ్బంది పడుతున్న వారిని తిరుమలాయపాలెం సీహెచ్‌సీకి పంపించి మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రత్యేక వాహనాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఈఓలు రామయ్య, నరేష్ ఎంఎల్‌హెచ్‌పీలు మానస, సంధ్య ఎఎన్‌ఎం సుగుణ, ఆశ అనిత పాల్గొన్నారు.

కూలీల సంఖ్య మరింత పెంచాలి

నేలకొండపల్లి: ఉపాధి హామీ కూలీల సంఖ్య మరింత పెంచాలని నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండలంలోని సుర్దేపల్లి పంచాయతీలో ఉపాధి పనులను సోమవారం పరిశీలించారు. కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. తాగునీటి, నీడ సౌకర్యం కల్పించారు. అనంతరం అమ్మ ఆదర్శ పాఠశాలలో జరుగుతున్న పనులను పరిశీలించారు. పంచాయతీకి చెందిన నర్సరీని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు... పని అడిగిన ప్రతీ ఒక్కరికి పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో ఆర్.సునీత, టీఏ, శైలజా, పాల్గొన్నారు.



ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న ఎంపీడీఓ యర్రయ్య

కామేపల్లి : ఉపాధి హామీ పని ప్రదేశాల్లో కూలీలకు నీడను ఏర్పాటు చేయాలని ఎంపీడీఓ రవీందర్ అన్నారు. సోమవారం మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో పని ప్రదేశాల్లో కూలీలకు నీడ కోసం టెంట్లు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున కూలీలు వడదెబ్బకు గురికాకుండా పని ప్రదేశాల్లో టెంట్లను వినియోగించి కూలీలకు నీడను ఏర్పాటు చేయాలన్నారు.

హక్కుల కోసం పోరాడుదాం



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న వెంకయ్య

రఘునాథపాలెం: ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడానికి, కూలీల హక్కుల కోసం పోరాడాలని, రోజుకు కూలీ రూ.600 ఇవ్వాలని ఏఐపీకేఎంఎస్ రాష్ట్ర నాయకుడు బందెల వెంకయ్య అన్నారు. సోమవారం మండలంలోని రాంక్యాతండాలో ఉపాధికూలీలతో ఆయన మాట్లాడుతూ.... మంచినీటి సరఫరా, మజ్జిగ, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, నిమ్మరసం, మెడికల్ కిట్లు, పని ప్రదేశంలో టెంట్లు ఏర్పాటుచేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి తిమ్మిడి హనుమంతరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి కేలోతు పాపారావు పీవైఎల్ జిల్లా అధ్యక్షుడు జాటోత్ ప్రేమ్‌సింగ్, ధరావత్ లక్ష్మణ్, హాలియా, గుగులోతు మూర్తి, మాజీ ఎంపీపీ మాలోత్ శాంత, మాజీ సర్పంచ్ ధరావత్ హమాలి, సక్రు దేవ, శ్రీను, మంగీలాల్, మహేష్, రాందాస్, బాబు తదితరులు పాల్గొన్నారు.

'ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో మోసం'



మాట్లాడుతున్న రామకృష్ణ

ఖమ్మంమయూరిసెంటర్: అనుమతులు లేకుండానే పలు ప్రవేటు పాఠశాలలు విద్యార్థుల నుంచి అడ్మిషన్ల ఫీజులు కట్టించుకుంటూ ఇంటర్నేషనల్ స్కూల్ పేర్లతో మోసం చేస్తున్నాయని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఇటికాల రామకృష్ణ అన్నారు. సోమవారం ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో ఏర్పాటుచేసిన సంఘ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండానే అడ్మిషన్లు నిర్వహిస్తున్న స్కూల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొన్ని పాఠశాలల యాజమాన్యం తమ వద్ద అడ్మిషన్లు పూర్తయ్యాయని చెప్పడం బాధకరమన్నారు. తల్లిదండ్రులను మోసం చేస్తున్న విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని, కలెక్టర్ స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు శివ, వంశీ, రాహుల్, నరేష్, గోపి, సాయి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఖమ్మంవ్యవసాయం: నగరంలోని ఇల్లెందు క్రాస్ రోడ్ 33/11 కేవీ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ కవిరాజ్‌నగర్ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని టౌన్-3 ఏఈ బి.తావుర్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో కవిరాజ్‌నగర్ రోడ్ నెంబర్ 9, 10 లైన్లలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

గ్రామ లైబ్రరీకి పుస్తకాలు



పుస్తకాలు అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

రఘునాథపాలెం: మండలంలోని సూర్యతండా గ్రామ లైబ్రరీకి నేషన్స్ ఫస్ట్ హ్యూమన్ చైన్ ఫౌండేషన్ మిషన్ ప్రాజెక్ట్ తరపున పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను సోమవారం వితరణగా అందజేశారు. బెంగళూరుకు చెందిన బిజ్జం సురేష్ వీటిని అందజేశారని ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ శివాలాల్ తెలిపారు. అలాగే, మోతీలాల్, బావుసింగ్ మెమోరియల్ ఫౌండేషన్ నుంచి పుస్తకాలు భద్రపర్చడానికి బీరువా సమకూర్చారు. ఈ కార్యక్రమంలో ఇంజనీర్ కోటేష్, ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ అధికారి అనిల్‌కుమార్‌తో పాటు శివాలాల్, రవి, పవన్, సందీప్, నందులాల్ పాల్గొన్నారు.

రాములోరి కల్యాణానికి తలంబ్రాలు తయారు

నేలకొండపల్లి: పరమ భక్తగ్రేసరుడు కంచర్ల గోపన్న (భక్త రామదాసు) మందిరంలో శ్రీరాములోరి కల్యాణానికి ఆయన మందిరం ముస్తాబైంది. ఈ మేరకు సోమవారం మహిళలు మందిరాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి కల్యాణ తంతు ప్రారంభించారు. సువు కొట్టి, గోటి తలంబ్రాలను సిద్ధం చేసి కలిపారు. భద్రాచలం దేవస్థానం అందించే తలంబ్రాలను, స్థానిక భక్తులు తయారు చేసిన వాటిని కలిపి వేడుకకు సర్వం సిద్ధం చేసి అర్చకుడు సౌమిత్రి రమేష్ కు అందించారు.



పసుపు కొమ్ములు దంచుతున్న మహిళలు

కంప్యూటర్ ఆపరేటర్లకు నగదు చెల్లింపు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజాపాలన దరఖాస్తుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసిన కంప్యూటర్ ఆపరేటర్లకు కేఎంసీ అధికారులు నగదు చెల్లించారు. ప్రజల నుండి స్వీకరించిన ఆరు గ్యారంటీల దరఖాస్తులను కేఎంసీ అధికారులు జనవరిలో ప్రైవేట్ ఆపరేటర్ల ద్వారా ఆన్‌లైన్ చేయించారు. నాటి నుండి ఆపరేటర్లు నగదు కోసం ఎదురుచూస్తుండగా, తాజాగా 238 మందికి రూ.8.43 లక్షలు విడుదల చేశారు. ఈ నగదును ఆపరేటర్ల బ్యాంక్ ఖాతాల్లో అధికారులు జమ చేస్తున్నారు.

నాణ్యమైన విద్యకు దోహదం



బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మం సహకారనగర్: విద్యార్థుల ఉన్నత చదువుల కోసం నాణ్యమైన విద్యను అందించేందుకు తమ యూనివర్సిటీ ముందుంటుందని మార్వాడి యూనివర్సిటీ ప్రిన్సిపల్ ఫ్యాకల్టీ ఆఫ్ ఇంజనీర్ రాజేష్‌కుమార్ పటేల్ అన్నారు. సోమవారం నగరంలోని పాత సీపీఐ కార్యాలయం కాంప్లెక్స్‌లో యూనివర్సిటీ ఖమ్మం రీజినల్ అడ్మిషన్ ఆఫీస్‌ని సోమవారం ప్రారంభించారు. యూనివర్సిటీలో కోర్సులు డిప్లమా, బీటెక్, ఎంబీఏ, ఫార్మసీ, బీఎస్సీ అగ్రికల్చర్, ఫిజియోథెరపీ, ఎల్‌ఎల్‌బీ తదితర కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం బ్రాంచ్ మేనేజర్ వెంకీ నాయుడు, చరన్ అల్లష్యం, తిరుమల రెడ్డి గారు, దివ్య బాలినేని పాల్గొన్నారు.

'కోడ్' ఉండగానే తొలగిన ముసుగు..!

ఖమ్మంమయూరిసెంటర్: ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో రాజకీయ నాయకుల విగ్రహాలు, రాజకీయ పార్టీల దిమ్మెలకు ముసుగు వేయాల్సి ఉంటుంది. అయితే నగరంలో అధికారుల నిర్లక్ష్యంతో కోడ్ ముగియక ముందే రాజకీయ నాయకుల విగ్రహాలకు వేసిన ముసుగు తొలగిపోతుంది. పాకబండబజార్‌లోని దివంగత ఎన్టీఆర్ విగ్రహానికి వేసిన ముసుగు తొలగినా అధికారులు, సిబ్బంది పట్టించుకోకపోవడంపై స్థానికులు విమర్శలు చేస్తున్నారు. కోడ్‌ను సక్రమంగా అమలు చేయడం లేదని ఆరోపణలు చేస్తున్నారు.



ముసుగు లేని ఎన్టీఆర్ విగ్రహం

బీజేపీ గెలుపు ఖాయం

నేలకొండపల్లి: ఖమ్మం నుంచి బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమని పార్టీ జిల్లా నాయకులు నంబూరి రామలింగేశ్వరరావు అన్నారు. మండల కేంద్రంలో సోమవారం బీజేపీ అభ్యర్థి వినోద్ రావు విజయాన్ని కాంక్షిస్తూ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ఇన్‌చార్జ్ వెంకట్రామయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నున్నా రవికుమార్, మండల ప్రధాన కార్యదర్శి పాగర్తి సుధాకర్, జ్ఞానరత్నం, నాగేశ్వరరావు, హనుమంతరావు, వెంకయ్య ఉన్నారు.

ఖమ్మం మామిళ్లగూడెం: తాండ్ర వినోద్‌రావు విజయాన్ని కాంక్షిస్తూ నగరంలోని 57వ డివిజన్‌లో బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. సెన్సార్‌బోర్డు మెంబర్ కమర్తపుడి ఉపేందర్, బీజేపీ ఓబీసీ మోర్చా రుద్రగానిమాదవ్ , శక్తి కేంద్రం ఇన్‌చార్జ్ యుగంధర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు .

వైభవంగా ఆలయ ప్రతిష్ఠ

కామేపల్లి: మండలంలోని నెమలిపురి గ్రామంలో శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయ ప్రతిష్ఠ మహోత్సవం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్చరణ మధ్య ప్రతిష్ఠ కార్యక్రమాలను నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమానికి వేలాది మంది భక్తులు హాజరై భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమాన్ని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి రాంరెడ్డి గోపాల్‌రెడ్డి, నాయకులు రాంరెడ్డి శ్రీ చరణ్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు రాంరెడ్డి కృష్ణారెడ్డి,గింజల నరసింహారెడ్డి, గుజ్జర్లపూడి రాంబాబు, మేకల మల్లిబాబుయాదవ్, రాంరెడ్డి జగన్నాథరెడ్డి, దమ్మలపాటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న భక్తులు

నేడు, రేపు గాంధీచౌక్ బంద్

- సీతారాముల కల్యాణోత్సవం సందర్భంగా క్రయవిక్రయాలు నిలిపివేత

ఖమ్మంగాంధీచౌక్: శ్రీ రామనవమి సందర్భంగా మంగళ, బుధవారాల్లో ఖమ్మంలోని గాంధీచౌక్‌లో వ్యాపారాలను నిలిపివేస్తున్నట్లు చాంబర్ ఆఫ్ కామర్స్ కిరాణా జాగిరి మర్చంట్స్ అసోసియేషన్ బాధ్యులు తెలిపారు. ఏటా మాదిరిగానే ఈ ఏడాది కూడా గాంధీచౌక్ కేంద్రంలో కిరాణా జాగిరీ మర్చంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన శ్రీ సీతారామచంద్రస్వామి 77వ వార్షిక కల్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా మంగళ, బుధవారాల్లో గాంధీచౌక్ సెంటర్‌లోని కిరాణా అనుబంధ వ్యాపార సంస్థల కార్యకలాపాలను నిలిపివేస్తున్నామని వెల్లడించారు. కాగా, సీతారాముల కల్యాణం సందర్భంగా గాంధీ విగ్రహం నుంచి పోస్టాఫీస్ సెంటర్ వరకు చలువ పందిళ్లువేసి విద్యుత్ దీపాలతో అలంకరిస్తుండగా, ఎండ తీవ్రతతో భక్తులు ఇబ్బంది పడకుండా తాగునీరు సమకూర్చనున్నారు. కిరాణ జాగిరీ మర్చంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేములపల్లి వెంకటేశ్వరరావు నేతృత్వాన కమిటీ ఆధ్వర్యాన ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు.

నష్టపరిహారం అందించాలి



మాట్లాడుతున్న బొంతు రాంబాబు

కామేపల్లి: సీతారామ ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణానికి అవసరమైన భూసేకరణలో భాగంగా భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం అందించి వెంటనే న్యాయం చేయాలని అఖిలపక్షం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన రౌండ్ టెబుల్ సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రాజెక్టు ప్రధాన కాలువ నిర్మాణానికి మండలంలోని రైతుల నుంచి భూసేకరణ చేపట్టి ఏళ్ల గడుస్తున్న ఇప్పటి వరకు రైతులకు నష్ట పరిహారం అందించలేదన్నారు. తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, నాయకులు దుగ్గి కృష్ణ, అచ్చయ్య, ఏపూరి లతాదేవి, శ్రీను, అప్పారావు, రాకేష్, రామారావు, శ్రీనివాసరావు, బాలాజీ, భద్రయ్య, రామకృష్ణ, సుగుణమ్మ ఉన్నారు.

సన్మానం

కామేపల్లి: తెలంగాణ రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన సింగరేణి మండల వాసి ఆదేర్ల రాములును సోమవారం మండలకేంద్రంలో నాయకులు కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిప్పలపల్లి శ్రీనివాసరావు, ఆదూరి ప్రసాద్, మాసుకొండ ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యక్ష ప్రసారానికి అనుమతివ్వాలి

ఖమ్మం మామిళ్లగూడెం: భద్రాచలం సీతారామ కల్యాణం ప్రత్యక్ష ప్రసారానికి అనుమతించాలని ఆమ్ ఆద్మీపార్టీ తెలంగాణ కోర్ కమిటీ సభ్యులు నల్లమోతు తిరమలరావు సోమవారం ఒక ప్రకటనలో ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేశారు. కోడ్ పేరుతో భక్తులకు అసౌకర్యం కలిగించడం సరికాదన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

రఘునాథపాలెం: మండలంలోని జీకె బంజరకు చెందిన పలువురు ఎంపీపీ భూక్యా గౌరి లాలు ఆధ్వర్యాన సోమవారం కాంగ్రెస్‌లో చేరారు. ఖమ్మంలోని పార్టీ కార్యాలయంలో వీరికి కాంగ్రెస్ జిల్లా, నగర అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మహ్మద్ జావేద్ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బానోత్ బాలాజీ, బాదావత్ రవి, ఇరుకు రామయ్య, భూక్యా పరమయ్య, మాలోత్ హట్యా, మాలోత్ రమేశ్ తదితరులు ఉండగా, నాయకులు భూక్యా శ్రీను, మాలోత్ నారాయణ, బోడా లాల్ సింగ్, పెనుగొండ రాజు, బోడా బావ్‌సింగ్, బానోత్ చిన్నా, రాము, సంతు, పరశురాం పాల్గొన్నారు.

చలివేంద్రాలు ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: డీవీఎస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గట్టయ్యసెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. తాండ్ర వినీత్‌రావు, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి ధనియాకుల వెంకటనారాయణయాదవ్, నున్నా రవి, హరీష్, నాగరాజు, సుధాకర్, శ్రీనివాసరెడ్డి, వెంకట రమణ, మహేందర్‌సింగ్, వీరభద్రం, మాధవ్, రాంబాబు, రజనీ, అనిత ఉన్నారు.



ఖమ్మం మామిళ్లగూడెం: చలివేంద్రం ప్రారంభిస్తున్న గల్లా సత్యనారాయణ

పాత బస్టాండ్‌లో..

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం పాత బస్టాండ్‌లో శ్రీశ్రీశ్రీశ్రీ విశ్వస్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని ఖమ్మం డిపో మేనేజర్ బి.శ్రీనివాసరావు ప్రారంభించారు.



ఖమ్మంమయూరిసెంటర్: పాత బస్టాండ్‌లో..